క్లుప్తంగా

సీఎంను కలిసిన ఫుడ్ కమిషన్ మాజీ చైర్మన్



సాక్షి, కామారెడ్డి: ఫుడ్ కమిషన్ మాజీ చైర్మన్ కొమ్ముల తిర్మల్‌రెడ్డి బుధవారం హైదరాబాద్‌లోని ప్రగతి భవనలో సీఎం కేసీఆర్‌ను కలిశారు. కామారెడ్డి నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నందున ఆహ్వానించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పరిస్థితులపై చర్చించినట్లు తిర్మల్‌రెడ్డి 'సాక్షి'తో మాట్లాడుతూ పేర్కొన్నారు.

వరి పంటల పరిశీలన

లింగంపేట(ఎల్లారెడ్డి): నల్లమడుగు గ్రామానికి చెందిన రైతుల వరి పంటలను బుధవారం జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గ్రామానికి చెందిన పలువురు రైతులు మెట్ట పద్ధతిలో వరి సాగు చేశారని, ఈ పద్ధతిలో సాగు వల్ల సమయం ఆదా అవడమే కాకుండా కూలీల ఖర్చు సైతం తగ్గుతుందన్నారు. నారు మడి ఏర్పాటు చేయనవసరంలేదన్నారు. ఎకరాకు నాలుగు వేల నుంచి ఐదు వేల వరకు ఖర్చు తగ్గుతుందన్నారు. మెట్ట సాగులో కలుపును నివారించడం కోసం వివాయా అనే మందును ఎకరాకు ఒక లీటర్ చొప్పున పిచికారీ చేయాలన్నారు. ఏఈవో సంతోష్, రైతులు పాల్గొన్నారు.

క్రీడల నిర్వహణపై సమావేశం

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మండల స్థాయి క్రీడలపై ఎంఈవో కార్యాలయంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పీఈటీలతో ఎంఈవో వెంకటేశం బుధవారం సమావేశం నిర్వహించారు. సెప్టెంబర్‌లో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడల నిర్వహణకు ప్రధానోపాధ్యాయులు అంగీకరించినట్లు ఎంఈవో తెలిపారు. ప్రధానోపాధ్యాయులు గోవర్ధన్, నాగరాజు, మాణిక్యం, చిరంజీవులు తదితరులున్నారు.

సబార్డినేటర్ల నియామకం

లింగంపేట(ఎల్లారెడ్డి): జిల్లాలోని 15 ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు 15 మంది ఆఫీస్ సబార్డినేటర్లు, ఆరుగురు రికార్డు అసిస్టెంట్లను నియమించినట్లు ఇంటర్ జిల్లా విద్యాధికారి షేక్ సలాం తెలిపారు. బుధవారం ఆయన లింగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడారు. ఈ నెల 31 వరకు మొదటి సంవత్సరం విద్యార్థులు అడ్మిషన్లు పొందవచ్చన్నారు. గత సంవత్సరం కంటే ఈ విద్యా సంవత్సరం ఫస్టియర్‌లో ఎక్కువ మంది విద్యార్థులు అడ్మిషన్ పొందినట్లు తెలిపారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి, అధ్యాపకులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి యోగాసన పోటీలకు ఎంపిక

రామారెడ్డి: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(రెడ్డిపేట స్కూల్ తండా)కు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి యోగాసన పోటీలకు ఎంపికైనట్లు ఇన్‌చార్జి హెచ్‌ఎం లక్ష్మీరాజం తెలిపారు. మంగళవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగిన నాలుగో జిల్లా స్థాయి యోగాసన పోటీల్లో విద్యార్థులు జూనియర్ బాలుర విభాగంలో గంగావత్ సందీప్ మొదటి స్థానం, గంగావత్ నవదీప్ రెండవ స్థానం, సలావత్ రాకేష్ మూడో స్థానంలో నిలిచి వచ్చే నెలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెడ్మాస్టర్ జనపాల లక్ష్మీరాజం, ఉపాధ్యాయులు నరేష్, సుధారాణి, మహేందర్, సయ్యద్ ఖాజా తదితరులు పాల్గొన్నారు.

ఆరేపల్లి కేజీబీవీ నుంచి..

మాచారెడ్డి: రాష్ట్ర స్థాయి యోగా మీట్‌కు పాల్వంచ మండలం ఆరేపల్లి వద్ద నున్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ విద్యార్థినులు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన సహస్ర, సింధూజ, సరస్వతి, మౌనిక, ఐశ్వర్య, వైష్ణవిలు ఎంపికైనట్లు ప్రత్యేక అధికారిణి మైసకళ, పీఈటీ గౌమతి తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ బృందం విద్యార్థినులను అభినందించారు.

స్కూల్ బ్యాగుల వితరణ



బాన్సువాడ: బీర్కూర్ మండలం కిష్టాపూర్ ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు నిట్టు విఠల్‌రావు మాట్లాడుతూ.. 380 మందికి బ్యాగులను అందజేశామని తెలిపారు. సంఘం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విశ్వనాథం, జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బామన్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో..

గాంధారి(ఎల్లారెడ్డి): బామన్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో కాయితీ తండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లు, అంగన్ వాడి విద్యార్థులకు పలకలు బుధవారం వితరణ చేసినట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు అమర్ సింగ్ తెలిపారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.

హామీల అమలులో బీఆర్ఎస్ విఫలం

- బీజేపీ నేతల విమర్శ
- జిల్లా వ్యాప్తంగా బీజేపీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల ముట్టడి



ఎల్లారెడ్డిలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ముట్టడికి తరలివెళ్తున్న బీజేపీ నేతలు



బాన్సువాడలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

బాన్సువాడ/ఎల్లారెడ్డి: జిల్లాలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాలను బుధవారం బీజేపీ నాయకులు ముట్టడించారు. ర్యాలీగా వెళ్లి క్యాంపు కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించారు. గత ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, అమలులో పూర్తిగా విఫలమైందని బీజేపీ నేతలు విమర్శించారు. దళితులకు మూడెకరాల భూమి, నిరుద్యోగ భృతి, ఉచిత ఎరువుల పంపిణీ కార్యక్రమాన్ని బీఆర్ఎస్ పార్టీ అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ బీజేపీ పార్టీ ఆదేశాల మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నేతలు తెలిపారు. పలువురు కార్యకర్తలు, నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. కొంత సమయం తర్వాత విడిచిపెట్టారు.

బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తల మధ్య ఘర్షణ



బీజేపీ కార్యకర్తలను అడ్డుకుంటున్న పోలీసులు

బిచ్కుంద(జుక్కల్): ప్రభుత్వం పింఛన్లు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు పంపిణీ చేయడం లేదని ఆరోపిస్తూ బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం బీజేపీ కార్యకర్తలు బిచ్కుందలో ఎమ్మెల్యే హన్మంత్ సింధే ఇంటి ముట్టడికి బయలుదేరడంతో బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. బీజేపీ కార్యకర్తలు ర్యాలీగా ఎమ్మెల్యే హన్మంత్ సింధే ఇంటికి వచ్చారు. అక్కడే ఉన్న ఎమ్మెల్యే వీరి దగ్గకు వచ్చి మీ సమస్య ఏంటి ఎందుకు వచ్చారని బీజేపీ కార్యకర్తలను అడుగుతుండగా ఆవేశంలో కొందరు బీజేపీ కార్యకర్తలు ఎమ్మెల్యే డౌన్‌డౌన్ అంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో ఎమ్మెల్యే, బీజేపీ కార్యకర్తల మధ్య కొంత వాగ్వివాదం జరిగింది. ఈ క్రమంలో రెండు పార్టీల కార్యకర్తలు జెండాలతో ఒకరిపై ఒకరు దాడికి దిగారు. ఎమ్మెల్యే ఇంటి వద్ద ఘర్షణ జరుగుతుందని సమాచారం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘటనా స్థలానికి వచ్చి బీజేపీ కార్యకర్తల జెండాలను లాక్కొని దాడికి యత్నించి దొరికిన వారికి చితకబాదారు.

గూండాయిజం చూపించడానికి ప్రయత్నిస్తే సహించం



మాట్లాడుతున్న ఎంపీపీ, బీఆర్ఎస్ నాయకులు

బిచ్కుంద(జుక్కల్): బీజేపీ కార్యకర్తలు, నాయకులు ఎమ్మెల్యే హన్మంత్ సింధేపై గూండాయిజం చూపించడానికి ప్రయత్నిస్తే సహించేది లేదని ఎంపీపీ అశోక్ పటేల్ హెచ్చరించారు. బుధవారం బీజేపీ కార్యకర్తలు ఎమ్మెల్యే ఇంటి ముట్టడిలో జరిగిన ఘర్షణను తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పద్ధతిలో ధర్నాలు, నిరసనలు చేసుకోవచ్చు అన్నారు. బీఆర్ఎస్ నాయకులు దాడి చేయాలనుకుంటే బీజేపీ కార్యకర్తలు ఎక్కడా కూడా తిరగలేరని హెచ్చరించారు. నాయకులు నాల్చర్ రాజు, ఏఎంసీ చైర్మన్ నాగ్‌నాథ్ పటేల్, పార్టీ అధ్యక్షుడు వెంకట్ రావు, గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దాడులకు బీజేపీ కార్యకర్తలు భయపడరు



మాట్లాడుతున్న బీజేపీ నేత అరుణతార

బిచ్కుంద(జుక్కల్): బీఆర్ఎస్ నాయకులు బీజేపీ కార్యకర్తలపై దాడి చేసి భయపెట్టాని చూస్తున్నారని, బీజేపీ కార్యకర్తలు భయపడే రకం కాదని బీజేపీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే అరుణతార అన్నారు. బుధవారం దాడిలో గాయపడిన కార్యకర్తల ఇంటికి వెళ్లి ఆమె పరామర్శించి మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులను ప్రజల తరపున ఎవరైనా ప్రశ్నిస్తే ఎందుకు ఆగ్రహం వస్తుందని ప్రశ్నించారు. శాంతియుత వాతావరణంలో బీజేపీ కార్యకర్తలు ధర్నాలు, ముట్టడి కార్యక్రమాలు చేస్తుంటే దాడి చేయడం చాలా బాధాకరమని అన్నారు. దాడికి ప్రతిదాడి చేయవచ్చు..అది మా సంస్కృతి కాదని ఊరుకున్నామన్నారు. ప్రజల ఆదరణ చూసి బీఆర్ఎస్ తట్టుకోలేకపోతుందని, దాడి చేసి భయపెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. ఈ పద్ధతిని బీఆర్ఎస్ మానుకోవాలని సూచించారు.

డీటీఎఫ్ మహాసభలను విజయవంతం చేయాలి

- డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బాబూరావ్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

దోమకొండ: డీటీఎఫ్ రాష్ట్ర మహాసభలు అక్టోబర్‌లో మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహిస్తున్నామని, సభలను విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాబూరావ్ కోరారు. బుధవారం మండల కేంద్రంలో మహాసభల పోస్టర్‌లను ఆవిష్కరించి మాట్లాడారు. 5వ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభలు జరుగుతాయన్నారు. సభలకు అఖిల భారత విద్యాహక్కు వేదిక అధ్యక్షుడు ప్రొఫెసర్ హరగోపాల్, డీటీఎఫ్ సహాధ్యక్షుడు సోమయ్య, రాష్ట్ర ప్రతినిధులు హాజరవుతారన్నారు. సంఘం రాష్ట్ర కమిటీ ప్రతినిధులు సునంద, కామారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి దేవులా, తదితరులున్నారు.

కాంగ్రెస్ టికెట్ కోసం దరఖాస్తులు





దరఖాస్తులతో మోతీలాల్.. శ్రీనివాస్‌గౌడ్

బాన్సువాడ: బాన్సువాడ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేసేందుకు టికెట్ కోసం బుధవారం గాంధీభవన్‌లో పలువురు నేతలు దరఖాస్తులు చేసుకున్నారు. వైద్య వృత్తిలో ఉన్న మోతీలాల్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్‌లు దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా మోతీలాల్ సాక్షితో మాట్లాడుతూ.. దరఖాస్తు విధానం చాలా బాగుందని, నిజమైన కార్యకర్తలకు అవకాశం కలుగుతుందని అన్నారు. ఇది వరకే బాన్సువాడ నుంచి కాసుల బాల్‌రాజ్, అడ్వకేట్ వెంకట్‌రెడ్డి, కూనిపూర్ రాజిరెడ్డి, మాసాని శ్రీనివాస్‌రెడ్డి, అంబర్‌సింగ్‌లు దరఖాస్తు చేశారు.

'వెంటనే సమస్యలన్నీ పరిష్కరిస్తా'

కామారెడ్డి రూరల్: మున్సిపల్‌లోని 9, 10వ వార్డుల్లో బుధవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నిట్టు వేణుగోపాల్‌రావు పర్యటించి వార్డు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదని, సీసీ రోడ్లు వేయించాలని, చెత్తబండి రావడం లేదని కాలనీవాసులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అంతేకాకుండా ప్లాట్లు కొనుగోలు చేసి ఎలాంటి నిర్మాణం చేపట్టకపోవడంతో ముళ్లపొదలు పెరిగి పాములు వస్తున్నాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఖాళీ స్థలాల ప్లాట్ల యజమానులకు నోటీసులు అందజేసి ప్లాట్లను చదును చేసుకునే విధంగా చూడాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. ఎమ్మెల్యే సహకారంతో సమస్యలను వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కౌన్సిలర్ సుగుణ, కాలనీవాసులు ఉన్నారు.

'శిశు మరణాల నివారణ కోసం నూతన అంబులెన్సులు'



కామారెడ్డి టౌన్: నవజాత శిశువులు, శిశు మరణాలను నివారించేందుకు ఈ నూతన అంబులెన్స్ ఎంతగానో ఉపయోగపడతాయని డీసీహెచ్ఎస్ విజయలక్ష్మి తెలిపారు. కామారెడ్డి జిల్లాకు ప్రభుత్వం కేటాయించిన నూతన అంబులెన్స్‌ను జిల్లా కేంద్ర ఆసుపత్రి వద్ద ఆమె ప్రారంభించి మాట్లాడారు. అధునాతన పరికరాలు, ఆక్సిజన్‌తో మెరుగైన వైద్య సేవలు అందుతాయన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంవో శ్రీనివాస్, వైద్యులు సుజాత, 108 అంబులెన్స్ ప్రోగ్రాం మేనేజర్ శ్రీకాంత్, ఈఎంఈ మేనేజర్ అనిరుద్, ఏఎఫ్ఈ విజయ్, 108 సిబ్బంది పాల్గొన్నారు.

ఎలాంటి అవకతవకలు జరగలేదు

బాన్సువాడ: బాన్సువాడలో పంపిణీ చేసిన డబుల్ బెడ్ రూం ఇళ్లలో ఎలాంటి అవకతవకలు జరగలేదని డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారులు అన్నారు. బుధవారం బాన్సువాడలో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి వద్దకు వచ్చి సంఘీభావం తెలిపారు. డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ బీజేపీ నాయకులు చేసిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడిని తీవ్రంగా ఖండిస్తున్నామని లబ్ధిదారులు అన్నారు. మచ్చ లేని మనిషి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అని అన్నారు.

వేతన సవరణ కమిషన్‌ను ఏర్పాటు చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, ఉపాధ్యాయులు

బాన్సువాడ: వేతన సవరణ కమిషన్‌ను వెంటనే నియమించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ అన్నారు. బుధవారం బాన్సువాడలో కరపత్రాలు ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. జూన్ 1తో గపీఆర్సీ సమయం ముగిసినందున జూలై 1 నుంచి రావాల్సిన నూతన వేతన సవరణ స్కేల్స్ కోసం ప్రభుత్వం వెంటనే పీఆర్సీ కమిషన్‌ను నియమించాలని అన్నారు. ఆలోగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు మధ్యంతర భృతిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యల పరిష్కారంలో తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. ప్రమోషన్లు, బదిలీల ప్రక్రియను వెంటనే నిర్వహించి పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు విఠల్, శ్రీనివాస్, శ్రీనివాస్‌రావు, మచ్చేందర్, హన్మండ్లు, తదితరులున్నారు.

మహిళలు ఆర్థికంగా అభ్యున్నతి సాధించాలి

- మండల సమాఖ్య మహాజన సభలో ఎంపీపీ రాజ్‌దాస్



ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఐకేపీ అధికారులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా ఎదగాలని నాగిరెడ్డిపేట ఎంపీపీ రాజ్‌దాస్ ఆకాంక్షించారు. నాగిరెడ్డిపేట ఐకేపీ కార్యాలయంలో బుధవారం మండల సమాఖ్య అధ్యక్షులు సుగంధ అధ్యక్షతన 16వ వార్షిక మహాజనసభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ .. మహిళలు బ్యాంకుల ద్వారా తీసుకునే రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళలకు సకాలంలో రుణాలను ఇప్పించేందుకు మండల సమాఖ్య కృషి చేయాలని చెప్పారు. మండల సమాఖ్య కార్యదర్శి అమృత, ఏపీఎం జగదీశ్‌కుమార్, సీసీలు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు

నాగిరెడ్డిపేట మండల సమాఖ్య నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల సమాఖ్య అధ్యక్షురాలిగా బేస్త శాంత(గోపాల్‌పేట), ఉపాధ్యక్షురాలిగా నాయికోటి లక్ష్మి(ఆత్మకూర్), కార్యదర్శిగా ఎర్రోల్ల నిరీక్షణ (మాటూర్), సహాయ కార్యదర్శిగా కట్ట రుక్కమ్మ(రామక్కపల్లి), కోశాధికారిగా గుండ్ల మునెమ్మ(జప్తిజాన్కంపల్లి)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏపీఎం జగదీశ్ కుమార్ ఆధ్వర్యంలో సీసీ దత్తు వారితో ప్రమాణస్వీకారం చేయించారు.

ముదిరాజ్‌లను గుర్తించిన పార్టీలకే మద్దతు



మాట్లాడుతున్న గంపల వెంకన్న



బీర్కూర్‌లో మాట్లాడుతున్న ముదిరాజ్ కులస్తులు

- సంఘం మండలాధ్యక్షుడు గంపల వెంకన్న

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఎమ్మెల్యే టికెట్ల కేటాయింపులో బీఆర్ఎస్ పార్టీ, ముదిరాజ్‌లకు తీరని అన్యాయం చేసిందని, ముదిరాజ్‌లను రాజకీయంగా గుర్తించిన పార్టీలకే తమ మద్దతు ఉంటుందని ముదిరాజ్ సంఘం మండలాధ్యక్షుడు గంపల వెంకన్న పేర్కొన్నారు. గోపాల్‌పేటలో బుధవారం ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ, జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ టికెట్ల కేటాయింపులో ముదిరాజ్‌లకు ప్రాధాన్యం ఇచ్చే పార్టీలకే భవిష్యత్తులో తాము మద్దతు తెలుపుతామని చెప్పారు. నాగిరెడ్డిపేట ఎంపీపీ రాజ్‌దాస్, నాయకులు బాల్‌రాజ్, సిద్ధిరాములు, తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లకు టికెట్లు ఇవ్వకపోవడం బాధాకరం

బాన్సువాడ: తెలంగాణలో అత్యధిక జనాభా ఉన్న ముదిరాజ్ కులస్తులకు బీఆర్ఎస్ పార్టీ టికెట్లు ఇవ్వకపోవడం బాధాకరమని ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకులు కరాటే రమేష్ ముదిరాజ్ అన్నారు. బుధవారం బీర్కూర్‌లో ఆయన మాట్లాడారు. తెలంగాణలో 60 లక్షల ఓటర్లున్న ముదిరాజ్ సామాజిక వర్గానికి బీఆర్ఎస్ పార్టీ ఒక్క టికెట్ కేటాయించకపోవడం సిగ్గు చేటని అన్నారు. నాయకులు మంత్రి గణేష్, దొంతురాం కాశీరాం, బోయిని గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న బీజేపీ నేత వెంకటరమణారెడ్డి



శాబ్దిపూర్‌లో పాల్గొన్న రమణారెడ్డి

బీబీపేట: యాడారంలో వడ్డెర సంఘం సభ్యుల ఆధ్వర్యంలో నిర్మిస్తున్న దుర్గమ్మ ఆలయానికి, మాందాపూర్ రెడ్డి సంఘం ఫంక్షన్ హాలు భవన నిర్మాణానికి బుధవారం బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన సొంత నిధులతో పనులను త్వరితగతిన పూర్తి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నక్క రవీందర్, పిడుగు శ్రీనివాస్, పోసు శివ, దేవరాజ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మార్కండేయ స్వామి ఆలయ నిర్మాణానికి..

కామారెడ్డి రూరల్: శాబ్దిపూర్ గ్రామ పద్మశాలి సంఘ సభ్యుల ఆహ్వానం మేరకు మార్కండేయ స్వామి ఆలయ నిర్మాణానికి బుధవారం కామారెడ్డి బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, పద్మశాలి సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

సమగ్రశిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి



రాజంపేట: పోస్టు కార్డులతో సమగ్ర శిక్ష ఉద్యోగులు



లింగంపేటలో..



కామారెడ్డి ఎంఈవో కార్యాలయం ఎదుట..

రాజంపేట/లింగంపేట/కామారెడ్డి రూరల్: తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం రాజంపేట, లింగంపేట, కామారెడ్డి మండలాల్లో సమగ్ర శిక్ష ఉద్యోగులు పోస్టుకార్డుల ఉద్యమం చేపట్టారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు సీఎం కేసీఆర్‌కు పోస్టు కార్డులు పంపారు. విద్యాశాఖ సమగ్ర శిక్షలో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సీఎం కేసీఆర్‌కు తెలిసేలా పోస్టుకార్డు ఉద్యమం చేపట్టినట్లు వారు తెలిపారు. మినిమమ్ టైమ్ స్కేల్, ఉద్యోగ భద్రత, ఉద్యోగుల క్రమబద్ధీకరణ చేపట్టాలని కోరుతూ పోస్టుకార్డు ద్వారా విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు.

సంక్షిప్తం

ఫిజియోథెరపి క్యాంపు

ఎల్లారెడ్డి: పట్టణంలోని భవిత కార్యాలయంలో బుధవారం ఫిజియోథెరపి క్యాంపు నిర్వహించారు. దివ్యాంగ చిన్నారులకు ఫిజియోథెరపి డాక్టర్ అరుణ్ వైద్య పరీక్షలను నిర్వహించారు. ప్రతి రోజు ఫిజియోథెరపి చేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఎంఈవో వెంకటేశం తదితరులున్నారు.

పెద్దకొడప్‌గల్‌లో..

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండల కేంద్రంలోని ఎంఆర్సీ కార్యాలయంలో ఎంఈవో దేవి సింగ్ ఆధ్వర్యంలో ఫిజియోథెరపి క్యాంప్ నిర్వహించారు. ఫిజియోథెరపిస్ట్ విశాలాక్షి సూచనలు, సలహాలు ఇచ్చారు.

పశువైద్య శిబిరం

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): పట్టణంలో పశువైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఆవులు, గేదెలకు గాలికుంటు వ్యాధి సోకకుండా టీకాలను వేసినట్లు వెటర్నరీ ఏడీ సుభాష్ తెలిపారు. సిబ్బంది రమేష్, శ్రీనివాస్ తదితరులున్నారు.

భిక్కనూరు: పెద్దమల్లారెడ్డిలో పశువైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. టీకాలు వేశారు. పశువైద్యాధికారి దేవేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మి రాజలింగం, ఎంపీటీసీ కోదూరి సాయగౌడ్ పాల్గొన్నారు.

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ప్రభుత్వ విప్

భిక్కనూరు: ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ తిరుమల వేంకటేశ్వరస్వామిని బుధవారం దర్శించుకున్నారు. వచ్చే ఎన్నికల్లో సీఎం కేసీఆర్‌ను మూడోసారి సీఎంగా గెలిపించాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు.

గంప గోవర్ధన్‌కు మంత్రి పదవి ఇవ్వాలి

కామారెడ్డి అర్బన్: ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ త్యాగానికి ప్రతిఫలంగా మంత్రి పదవి ఇవ్వాలని సీఎం కేసీఆర్‌ను బీఆర్ఎస్ కార్మిక విభాగం జిల్లా ప్రతినిధి గుర్రపు నారాయణ ఒక ప్రకటనలో కోరారు. కామారెడ్డి నుంచి సీఎం కేసీఆర్ పోటీ చేస్తున్నందున అన్ని పార్టీల వారు ఏకగ్రీవంగా ఎన్నుకోవడానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

నిజాంసాగర్(జుక్కల్): ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు చేయడం పట్ల బుధవారం మండల కేంద్రంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నేతలు పాలాభిషేకం చేశారు. నాయకులు దుర్గారెడ్డి, గంగారెడ్డి, గైని విఠల్, తదితరులున్నారు.

ఆర్థిక చేయూత

రాజంపేట: ఎల్లారెడ్డిపల్లిలో ఇటీవల ఆర్థిక ఇబ్బందులతో చనిపోయిన కప్పల సాయిలు కుటుంబానికి గ్రామ ట్రాక్టర్ యూనియన్ ఆధ్వర్యంలో రూ.25 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కప్పల సాయిలు తమతో స్నేహభావంతో ఉండేవాడని గుర్తు చేసుకున్నారు.

121వ రోజుకు చేరిన నిరసన దీక్షలు

భిక్కనూరు: ఎంఎస్ఎన్ ఫ్యాక్టరీ యాజమాన్యానికి వ్యతిరేకంగా కాచాపూర్‌లో వీడీసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలు 121వ రోజుకు చేరుకున్నాయి. ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రారంభమైన ఇంటర్ తరగతులు

బీబీపేట: మండలంలో నూతనంగా మంజూరైన జూనియర్ కళాశాలలో బుధవారం తరగతులు ప్రారంభించారు. బుధవారం యథావిధిగా లెక్చరర్లు హాజరై విద్యార్థులకు పాఠాలు బోధించారు. అడ్మిషన్ పొందాలనుకుంటే కళాశాలలో సంప్రదించాలని ప్రిన్సిపల్ జైపాల్‌రెడ్డి తెలిపారు.